క్లుప్తంగా

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు



పొన్నాడ అప్పలనాయుడు

వంగర: మండల పరిధి తలగాం గ్రామానికి చెందిన పొన్నాడ అప్పలనాయుడు(60) అదృశ్యమైనట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 8వ తేదీ ఉదయం గ్రామం నుంచి బస్సు ఎక్కి రాజాం వెళ్లాడని, తిరిగి ఇంటికి చేరుకోలేదని భార్య పొన్నాడ లక్ష్మి వంగర పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. తన భర్త ఆచూకీ కోసం గాలించాలని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఎస్సై వై.వి. జనార్ధన్ కేసు నమోదు చేశారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



చిన్నారులకు టీకాలు వేస్తున్న ఏఎన్ఎం రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త చంద్రకళ

రేగిడి: మండలంలోని వన్నలి, ఖండ్యాం, కె.వెంకటాపురం, లక్ష్మీపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు శనివారం వేశారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు టీకాలు వేసి, వాటి ఉపయోగంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ టీకాలు వేసుకుంటే ధనుర్వాతం, ఇతర వ్యాధులు పిల్లలకు రావన్నారు.

రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయండి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అందజేసిన ఇళ్లకు సంబంధించి, రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు సూచించారు. శనివారం స్థానిక పట్టణంలోని వార్డు సచివాలయాలను సందర్శించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. త్వరితగతిన రిజిస్ట్రేషన్లు చేపట్టాలని, సాంకేతికపరమైన సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

వాహన తనిఖీలు



వాహనాల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఎస్ఐ జయంతి, సిబ్బంది

బాడంగి: మండలంలోని కామన్నవలస గ్రామ సమీపంలో పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ ఆర్.జయంతి సిబ్బందితో కలిసి అటువైపుగా వస్తున్న వాహనదారులను ఆపి, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలతో పాటు వాహనదారుల లైసెన్స్‌లు పరిశీలించారు. వాహనాలతో రోడ్డుపైకి వచ్చేటప్పుడు సంబంధిత ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలని ఎస్ఐ తెలిపారు. ఆటోలు, క్యాబ్‌లలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలన్నారు. పెండింగ్ చలాన్లు వెంటనే చెల్లించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. మద్యం తాగి, వాహనాలు నడపవద్దన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు రమాకాంత్ శర్మ

వంగర: మండల పరిధిలోని కె.కొత్తవలస గ్రామంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వేమకోటి రమాకాంత్ శర్మ ఆధ్వర్యంలో వేకువ జామున సుప్రభాతసేవ, గోవిందనామస్మరణ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి ఆలయానికి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బొబ్బిలి సీటు బీసీలకు ఇచ్చే దమ్ముందా?

- టీడీపీ అధినేత చంద్రబాబుకు ఎమ్మెల్యే శంబంగి సూటిప్రశ్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గం సీటు బీసీలకు కేటాయించే దమ్మూధైర్యం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు ఉందా అని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ప్రశ్నించారు. శనివారం మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మణనాయుడు అధ్యక్షతన కొట్టక్కి గ్రామ నాయకులతో జరిగిన సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. నాలుగున్నరేళ్లుగా ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రతీ ఇంటికి వివరించి, వైఎస్సార్ సీపీకే అందరి ఓట్లు పడేలా చూడాలని సూచించారు. బీసీలంటే తనకెంతో ప్రేమ అని చెబుతున్న చంద్రబాబు బొబ్బిలిలో రాజులకు ఎందుకు పెత్తనం అప్పగిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయని బాబు అధికారంలోకి వస్తే రైతులు, మహిళలకు ఏదేదో చేస్తానని వాగ్దానాలు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో కనీస హామీలు నెరవర్చని ఆయన(చంద్రబాబు)కు అవకాశం ఇస్తే రాష్ట్ర ప్రజల జీవన విధానం అధోగతి పాలవుతుందన్నారు. నియోజకవర్గంలో ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను మోసం చేసిన రాజులను నమ్మవద్దని హితవుపలికారు. కనీస కుటుంబాలు లేని రాజుల వద్ద నియోజకవర్గంలో 90 శాతానికి పైగా ఉన్న బీసీలు చేతులు కట్టుకుని నిలబడాల్సిన అవసరం లేదన్నారు. నియోజకవర్గంలో తామే గెలుస్తామని వారు ప్రచారాలు చేయించుకుంటున్నారని, అవేవీ నమ్మవద్దన్నారు. గతంలో మున్సిపల్ చైర్మన్‌గా ఉండి, మున్సిపాలిటీకి న్యాయం చేయలేని బేబీ నాయన నియోజకర్గానికి ఏమి న్యాయం చేయగలరన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ ఇంటికి రూ.లక్షల్లో మేలు చేస్తున్నారని, రాజులిచ్చిన కొద్దిపాటి మేలుకు ఆశపడవద్దన్నారు. నియోజకవర్గంలో బీసీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలవనున్న తనను గెలిపించి, బీసీల ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం, దాని తోకపార్టీల నేతలు చెప్పే అబద్ధాలు ఎన్నడూ నమ్మవద్దన్నారు. ఎవరెన్ని కుతంత్రాలు చేసినా వైఎస్సార్ సీపీ మళ్లీ ప్రభంజనం సృష్టించడం ఖాయమన్నారు. వైఎస్సార్ సీపీ వల్లే అన్ని సామాజిక వర్గాలకు రాజ్యాధికారం దక్కిందన్నారు. రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి సీఎం జగనన్న సేవలు అవసరమన్నారు. రాష్ట్రంలో పెత్తందారులు, పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధంలో పేదల పక్షాన నిలిచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎస్.వి.మురళీకృష్ణారావు, మండల పార్టీ అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మణనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ సింహాచలంనాయుడు, వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాద్, మండల యూత్ ప్రెసిడెంట్ పత్తిగుళ్ల ఏకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి సీఎం జగన్



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- ఆర్‌బీకే ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మెంటాడ: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని, రైతు సంక్షేమమే లక్ష్యంగా గ్రామాల్లో ఆర్‌బీకేలు(రైతు భరోసా కేంద్రాలు) ప్రవేశపెట్టి అన్నదాతను అన్నివిధాలా ఆదుకుంటున్నారని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని జక్కువ గ్రామంలో రూ.22 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన ఆర్‌బీకే భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సకాలంలో అందజేయడం జరుగుతోందన్నారు. వీటితో పాటు భూసార పరీక్షలు చేసి, నేల సారవంతానికి తగ్గట్టు పంటలు వేసేలా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతోందని, పండిన పంటలను కూడా రైతులే నేరుగా ఆర్‌బీకేల వద్ద అమ్ముకునే సదుపాయం ఉందన్నారు. దళారుల బారినపడి రైతులు మోసపోకుండా ఉండేందుకే సీఎం జగనన్న ఈ వ్యవస్థను ప్రవేశపెట్టారని, ఎంతోమంది రైతులు ఆర్‌బీకేల పనితీరుతో ఆనందంగా సాగు చేసుకుంటున్నారన్నారు. గ్రామాల్లోకి ఆర్‌బీకేలు వచ్చిన తర్వాత సాగు సులువైందని అంటున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లచ్చిరెడ్డి, సత్యవతి, ఎంపీటీసీ కర్రి సంధ్య, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, జేసీఎస్ కన్వీనర్ త్రినాథ పాల్గొన్నారు.

21 పంచాయతీల్లో ఉపాధి పనులు



రాజాం: శ్యాంపురంలో వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఏపీవో సాయిరాం

రాజాం: మండలంలోని 21 గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయని ఏపీవో సాయిరాం తెలిపారు. శనివారం మండలంలోని శ్యాంపురం, గడిముడిదాం, మారేడుబాక గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఆయన మస్తర్లు రికార్డు చూసి, పనిలో ఉన్న వారికే మస్తరు వేయాలని, జాబ్‌కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలని సూచించారు. రెండు పూటలా నిర్దేశిత కొలతల్లో పనిచేస్తేనే రోజుకు రూ.270 వేతనం వస్తుందన్నారు. మండల వ్యాప్తంగా జరుగుతున్న పనులకు రోజుకు 3,450 మంది వేతదారులు పనులకు హాజరవుతున్నారన్నారు.



వంగర: కె.కొత్తవలసలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీవో సత్యవతి

వంగర: వలసల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం గ్రామాల్లోని అర్హులందరికీ ఉపాధి హామీ పనులు కల్పిస్తోందని ఏపీవో మర్రాపు సత్యవతి అన్నారు. మండల పరిధిలోని కె.కొత్తవలస, రుషింగి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివార పరిశీలించిన ఆమె మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయని, ప్రతిరోజూ 2,600 మంది వేతనదారులు పనుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. వేతనదారులకు గిట్టుబాటు వేతనం అందేలా పనులు చేయించాలని టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు.

అన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో ఉన్న బాలాజీ టెంపుల్ ఆవరణలో భక్తులకు శనివారం అన్నదానం చేశారు. అంతకు ముందు ఆలయ ప్రధానార్చకులు రామానుజాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అంతకాపల్లి, మొగిలివలస గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం ఏర్పాటు

బొబ్బిలి: అరుణాచల పుణ్యక్షేత్రంలో జరిగే మహా అన్నదానానికి సంబంధించి, జిల్లా కార్యవర్గం ఏర్పాటు చేసినట్లు అరుణాచల రుద్రాక్ష స్వామీజీ తెలిపారు. ఇదే విషయమై స్థానిక మున్సిపల్ ఆడిటోరియంలో శనివారం విలేకరులతో మాట్లాడిన ఆయన కార్యవర్గ జిల్లా అధ్యక్షులుగా రెడ్డి దామోదరరావు, శంబంగి సునీత, సుజాతలను నియమించినట్లు పేర్కొన్నారు.

నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ



చిన్నారులతో మాత్రలు మింగిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

రేగిడి: మండలంలోని ఉంగరాడ, ఉంగరాడ మెట్ట, వండానపేట, చాటాయివలస, కె.ఎం.వలస, ఉప్పర్నాయుడువలస, వన్నలి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నులిపురుగు నివారణ మాత్రలు శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఈ మాత్రల ప్రయోజనాన్ని ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లలు, పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. ఏడాది నుంచి 19 ఏళ్ల వయసున్న వారందరూ ఈ మాత్రలు వేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు

రాజాం: స్థానిక జీసీఎస్ఆర్ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు కుదమ తిరుమలరావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి జ్ఞానం ఆర్జించడంతో పాటు వ్యక్తిత్వ వికాసం పొందాలన్నారు. ఉన్నత లక్ష్యాలు చేరుకున్న వ్యక్తుల జీవిత చరిత్రలు చదవడాన్ని అలవాటు చేసుకోవాలని, ఇంట్లోనే ఓ గదిని గ్రంథాలయంగా మార్చుకుని, మంచి మంచి పుస్తకాలు ఉంచి, చదువుకోవాలని తెలిపారు. అనంతరం తిరుమలరావును సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తమరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపు కోసం కృషి చేయాలి



మునకలవలస గ్రామస్తులతో వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రేగిడి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా సమష్టిగా కృషి చేయాలని పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని బాలకవివలస, మునకలవలస, పనసలవలస, పారంపేట, కాగితాపల్లి, ఏవీపురం గ్రామాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు, పలు సంఘాల నాయకులను శనివారం కలిసిన ఆయన తనకు, పార్టీకి సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. అనంతరం ఆయా గ్రామాల్లోని పలువురి ఇళ్లకు వెళ్లి, ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. అలాగే పాలన ఎలా ఉందని అడిగి తెలుసుకోగా, వారంతా జగనన్న పాలన చాలా బాగుందని సంతోషంగా తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అర్హులకు కాకుండా జన్మభూమి కమిటీలు సూచించిన వారికే పథకాలు ఇచ్చేవని, ఇప్పుడు అలా కాదని కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించడం జరుగుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో తనను గెలిపించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి గిఫ్ట్‌గా ఇవ్వాలని కోరారు. పార్టీ శ్రేణులంతా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు, ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, సర్పంచ్‌లు వావిలపల్లి చంద్రశేఖర్, చుక్క వెంకటనాయుడు, కరణం శ్రీనివాసరావు, బంకి చంద్రశేఖర్, ఎంపీటీసీ పిల్లా గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రేగిడి: మండలంలోని బాలకవివలస గ్రామంలో టీడీపీకి చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో శనివారం చేరారు. వీరందరికీ వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ పార్టీ కండువాలు వేసి, ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఏనుగుతల కార్తీక్, ఆల్తి అప్పారావు, ఆల్తి రమణ, ఏనుగుతల తిరుపతిరావు, ఆల్తి మహేష్, ఆబోతుల జగన్, ఆల్తి చక్రవర్తి, టి.గౌరునాయుడు, డోల వైకుంఠ, డోల శ్రీనులతో పాటు మరో 30 మంది ఉన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న విధానం, ఆయన అందిస్తున్న సంక్షేమ పాలన నచ్చడంతోనే తామంతా పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని తలే రాజేష్ కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, సర్పంచ్ వావిలపల్లి చంద్రశేఖర్, ఎంపీటీసీ బంకి హరి పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం: రానున్న వేసవి నేపథ్యంలో స్థానిక పట్టణంలోని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు సూచించారు. శనివారం స్థానిక పట్టణంలోని రక్షిత మంచినీటి పథకాలు, తాగునీటి సరఫరా ట్యాంకర్ వాహనాలను పరిశీలించిన ఆయన ఎక్కడైనా పైపులైన్ లీకులు ఉంటే వాటిని వెంటనే బాగుచేయాలని తెలిపారు. నీటి పంపింగ్ సామర్థ్యం కూడా పెంచాలన్నారు. అలాగే తాగునీటి వనరులుండే ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, అక్కడి జంగ్సిల్, పిచ్చిమొక్కలు తొలగించాలన్నారు. అనంతరం వార్డుల వారీగా పారిశుద్ధ్య కార్యక్రమాలపై ఆరాతీసి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఎంవీ నాగరాజు, ఆర్ఐ చక్రవర్తి పాల్గొన్నారు.

అందుబాటులో పశువైద్య సేవలు



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పాడిరైతులకు అందుబాటులో పశువైద్య సేవలు వచ్చాయని ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు అన్నారు. మండలంలోని పక్కి గ్రామంలో ఎస్.ఎఫ్.ఎం.ఎస్.జి ఇండియా క్రెడిట్ వారి ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పశు సంచార వైద్యశాలలు ఏర్పాటు చేసి, పాడిపశువులు ఆరోగ్యంగా ఉండేలా చేసి, పాడి సంపద వృద్ధి చెందేలా చేశారన్నారు. ఈ శిబిరంలో 50 పాడిఆవులు, 20 ఆవుదూడలు, 40 గొర్రెలు, మేకలు, 13 కోళ్లకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా పశువైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సుధాకర్, ఎస్.ఎం.ఎఫ్.జి ఇండియా క్రెడిట్ బొబ్బిలి బ్రాంచ్ మేనేజర్ ఏసుబాబు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం



కొండకెంగువలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏవో వెంకటయ్య

రామభద్రపురం: అన్నదాతకు నిత్యం ప్రభుత్వం అండగా ఉంటోందని ఏవో వెంకటయ్య అన్నారు. మండలంలోని కొండకెంగువ గ్రామంలో వీహెచ్‌ఏ చేస్తున్న పంటల నమోదును ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం రైతులకు వివిధ సంక్షేమ పథకాల కింద రూ.38,84,36,330 అందజేసిందన్నారు. ఇందులో రైతు భరోసా పథకం కింద 8 వేల మంది రైతులకు రూ.38.18,53,850, పంటల బీమా కింద 71 మంది రైతులకు రూ.15,96,717, సున్నావడ్డీ పంట రుణాలు కింద 1722 మంది రైతులకు రూ.39,53,810, ఇన్‌పుట్ సబ్సిడీ కింద 270 మంది రైతులకు రూ.10,31,953 అందజేసిందన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. రైతులు కూడా గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు సహకరించి, ఈ-క్రాప్ నమోదు పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొండకెంగువ వీహెచ్‌ఏ చొక్కాపు అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ప్రాక్టికల్స్

బాడంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ సెకెండియర్ ప్రాక్టికల్స్ ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయని సంబంధిత అధికారులు వి.శంకరరావు, టి.రామదాసు శనివారం తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగ్గా, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే పరీక్షలకు టి.ఎల్.ఎన్, కేజీబీవీ, రామభద్రాపురం కేజీబీవీల నుంచి 187 మంది విద్యార్థులు, అంబేడ్కర్ గురుకుల కళాశాలలో ఈ నెల 14వ తేదీ వరకు జరిగే పరీక్షలకు అదే కళాశాలకు చెందిన 47 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు.

14న సామూహిక అక్షరాభ్యాసాలు

శృంగవరపుకోట: ఋషి పంచమి సందర్భంగా స్థానిక శ్రీరవితేజ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఈనెల 14న సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల డైరెక్టర్ పి.కృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8గంటలకు హోమం నిర్వహించి, తర్వాత అక్షర స్వీకార కార్యక్రమం జరిపిస్తారని, కావాల్సిన పూజా ద్రవ్యాలు పాఠశాల యాజమాన్యం సమకూరుస్తుందని పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బొబ్బిలి / రాజాం
9951602891, 9010133309
Office mail : vzmadvt@gmail.com